ఖరీఫ్‌పైనే కోటి ఆశలు

- ముందస్తు వర్షాలు అనుకూలం
- విత్తనాలు, ఎరువులు సిద్ధం
- 21 వేల హెక్టార్ల పంట సాగు లక్ష్యం
- వరి, పత్తి సాగుపై మొగ్గు
- సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

కోవెలకుంట్ల/బనగానపల్లె : మట్టిని నమ్ముకున్న అన్నదాతకు మరోసారి వ్యవసాయంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సమయం ఆసన్నమవుతోంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వాతావరణం అనుకూలించి వివిధ పంటల్లో అధిక దిగుబడులు సాధించి లాభాలు గడించిన రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌పై కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా ముందస్తు వర్షాలు అనుకూలంగా మారడంతో పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 21 వేల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం. ఆయా మండలాల్లో వరి, పత్తి, మినుము, కంది, ప్రొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న, పెసర, మిరప, ఉల్లి, వేరుశనగ, ఆముదం కొర్ర, తదితర పంటలు సాగు చేయనున్నారు. వర్షాలు ఖరీఫ్‌కు ఆశాజనకంగా మారడంతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలను దుక్కిదున్ని విత్తనానికి సిద్ధం చేసుకున్నారు.

పత్తి, వరి సాగుపైనే ఆశలు

గత ఏడాది ఖరీఫ్‌లో రైతులకు వరి, పత్తి సాగు అన్ని విధాలా కలిసి వచ్చి అధిక దిగుబడులు సాధించారు. సబ్ డివిజన్‌లో ఎనిమిది వేల హెక్టార్లలో కర్నూలు, నంద్యాల సోనా రకాలకు చెందిన వరి సాగు కాగా వాతావరణం అనుకూలించి ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడులు సాధించారు. మార్కెట్‌లో క్వింటాం రూ. 2వేలకు పైగా ధర పలకడంతో పెట్టుబడులుపోనూ ఆదాయం చేకూరింది. 3 వేల హెక్టార్లలో పత్తి, 2,200 హెక్టార్లలో మిరప సాగు కాగా ఆయా పంటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో ఆదాయం వచ్చింది. ఈ ఏడాది సీజన్‌కు ముందే వర్షాలు అనుకూలిస్తుండటంతో పత్తి, మిరప, వరిసాగుపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ పంటలతో పాటు మినుము, కంది, పెసర, వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న, ఆముదం, తదితర పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు సిద్ధం అవ్వుతున్నారు.



కోవెలకుంట్ల సమీపంలో విత్తనానికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

విత్తనాలు, ఎరువులు సిద్ధం

మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో వ్యవసాయ శాఖ విత్తనాలు, రసాయన ఎరువులను సిద్ధం చేసింది. వివిధ పంటల సాగుకు సంబంధించి నంద్యాల జిల్లాకు 1,92,336 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులను కేటాయించింది. 59,018 మెట్రిక్ టన్నుల యూరియా, 24,013 మెట్రిక్ టన్నుల డీఏపీ, 8,677 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 2,605 మెట్రిక్ టన్నుల సూపర్, 98,023 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను మంజూరు చేసింది. మొదటి విడత ఎరువులను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే జిల్లాకు 12, 870 క్వింటాళ్ల కంది, మినుము, వేరుశనగ, పెసర, జీలుగ, పిల్లిపెసర, తదితర విత్తనాలను కేటాయించింది.



ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న ఎరువులు

ఆర్‌బీకేల్లో రసాయన ఎరువులు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు 2,205 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు కేటాయించారు. ఆయా మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

నాలుగు ఎకరాల్లో పంటల సాగుకు సిద్ధం



నాకున్న రెండు ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్నా. విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారటంతో పొలాన్ని దుక్కిదున్ని విత్తనానికి సిద్ధం చేసుకున్నా. ఈ ఏడాది జొన్న, మినుము పంటల సాగు చేయాలని విత్తనాలను కొనుగోలు చేశా.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

క్లుప్తంగా

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డులో వెలసిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం మహానివేదన కార్యక్రమంతో ముగిశాయి. ఆలయ పీఠాధిపతి శ్రీనివాసఆచారి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాష్టోత్తర శతనామ పూజ, వీరకాళికాంబాదేవి అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు జరిగాయి. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామికి కుంభహారతులతో మహామంత్ర పుష్ప పఠనంతో మహానివేదన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలి



విద్యార్థులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

బేతంచెర్ల: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల నమ్మకాన్ని, ఆకాంక్షలను నెరవేర్చాలని ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు గుండాగోపాలు, పట్టణ అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు ధనుంజయ అన్నారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువ సత్కరించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గుండా జయ చంద్రయ్య, కిశోర్, శేషా మోహన్, బచ్చు సుబ్రహ్మణ్యం, ప్రసాదయ్య, మల్లికార్జున, శేఖర్, విష్ణు, రాజేంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండురంగడి కల్యాణం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున చిత్తా నక్షత్రమున స్వామివారి కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు జరుగనున్నాయి. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్ల కల్యాణాన్ని తిలకించాలని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



డోన్ ప్రభుత్వాసుత్రిలో రొట్టె, గుడ్లు పంపిణీ చేస్తున్న జాన్ ప్రభాకర్

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రార్థనా సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చేపట్టే పౌష్టికాహారం పంపిణీ కొనసాగింది. తెలంగాణా రాష్ట్రం నిజాంబాద్ జిల్లా విద్యుత్ శాఖ ఏడీ విజయసారథి ఆర్థిక సహకారంతో గర్భిణులు, బాలింతలు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్లు అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



గురువులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులను ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2000–2001 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 23 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదిపై చేరారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకట్రావు, హనీఫ్ హజరత్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రామేశ్వర్‌రెడ్డి, మహేంద్రారెడ్డి, గంగాధర్, అంజి, శ్లావలీ, సుజన్,శ్రీనివాసులు, రమణారెడ్డి, మహబూబ్‌వలీ, అనురాధ, అపర్ణ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (తెలుగు, ఇంగ్లిష్‌మీడియం) చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజకసత్యప్రపూర్ణ తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 1వ తేది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న జేసీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామిని ఆదివారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసిదర్శించుకున్నారు. జేసీకి ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు జేసీ కుటుంబ సభ్యుతో కలిసి అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం జాయింట్ కలెక్టర్‌ను ఆలయ సంప్రదాయం మేరకు సన్మానించి శివపార్వతుల చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రవీంద్రారెడ్డి తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలేటయ్యను దర్శించుకున్న జేసీ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా జేసీకి ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్ర పటం అందజేసి, శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుల్‌కుమార్‌రెడ్డికి శివపార్వతుల చిత్రపటం అందజేస్తున్న ఈఓ

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ఏవీఆర్ స్కూల్ వద్ద గుర్తు తెలియని యాచకుడు (40) మృతి చెందగా ఆదివారం పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి ద్రోణాచలం సేవా సమితి సభ్యులను అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు అనుమానాస్పదంగా మృతి చెందిన యాచకుడి శవానికి పాతపేట సమీపంలోని శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయ పద్ధతిలో సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల నిర్వాహణకు టౌన్ ఏఎస్ఐ భాస్కర్, కానిస్టేబుల్ శివశంకర్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ద్రోణాచలం సేవాసమితి సభ్యులు షాదిఖానా రాజ, గురుస్వామి, రసూల్, పానిపూరి మురళి, సయ్యద్ వలి, కానిస్టేబుల్ వెంకటేశ్ పాల్గొన్నారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

ఘనంగా సాయిబాబ ఆలయ వార్షికోత్సవం



ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: పట్టణంలోని షిర్డీసాయిబాబ దేవాలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సాయిబాబ ఉత్సవ విగ్రహాన్ని పట్టణ ప్రధానవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు బాబావారి పల్లకీని లాగి భక్తిని చాటుకొన్నారు.

హిందూ పరిరక్షణలో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

ప్యాపిలి : హిందూ సమాజాన్ని పరిరక్షించడంలో యువత ముందుండాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం విశ్వహిందూ పరిషత్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, హిందూ పరిరక్షణే లక్ష్యంగా వీహెచ్‌పీ పనిచేస్తుందన్నారు. హిందూ పరిరక్షణలో భజరంగ్‌దళ్ కూడా తనవంతు పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో దక్షిణప్రాంత సంయోజకులు పోలేపల్లి సందీప్, విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి, కంచి నరేష్‌కుమార్, భజరంగ్‌దళ్ సంయోజక్ అశోక్, రవిసింగ్, రామ్ ప్రతాప్, దేవి దయానంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం



సామూహిక సత్యనారాయణ స్వామివ్రతంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలోగాయత్రి మహిళా మండలి, శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సామూహిక సత్య నారాయణ స్వామివ్రతం జరిగింది. ఉదయం అర్చకులు సుబ్బచంద్రమౌళి శాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు సంప్రదాయబద్ధంగా సత్యనారాయణ స్వామివ్రతం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీగాయత్రి మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వాసవీమాత గ్రామోత్సవం



వాసవీ మాతకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ మాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా గోపాలు, జయచంద్రయ్య, కందగడ్డల మోహన్‌రావు, గురవయ్య, శేషా మోహన్, విష్ణు, రాజేంద్ర, సుబ్బయ్య గుప్త, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె : సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ ముగిశాక అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సాహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిరుపాల్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని నందివర్గం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులు, రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇతరులను రెచ్చగొట్టేలా మాట్లాడినా, ప్రవర్తించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సంబరాలు, విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లోని నిందితులు సార్వత్రిక ఎన్నికల లెక్కింపు రోజు ఇంట్లోనే ఉండాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

శాంతి రథం విరాళం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన బైసాని కృష్ణ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.8 లక్షల శాంతి రథాన్ని బైసాని సుబ్రహ్మణ్యం, హరినాథ్ బాబు, రమేష్ బాబు, గోపీనాథ్‌ద్ విరాళంగా అందజేశారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో శాంతి రథానికి పూజలు నిర్వహించి మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులకు వారు అందజేశారు. అనంతరం వారు మాట్లడుతూ తల్లితండ్రుల మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి స్వగ్రామానికి తమవంతుగా సేవ చేసేందుకు సంకల్పించామన్నారు. కార్యక్రమంలో మనవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శాంతి రథానికి పూజలు చేస్తున్న దాతలు

కొండెక్కిన చికెన్ ధరలు

- సామాన్యుడికి తప్పని నిరాశ
- ఇష్టారాజ్యంగా పెంచుతున్న వ్యాపారులు

డోన్ టౌన్/సంజామల: చికెన్ ధరలుకు రెక్కలు వచ్చాయి. పట్టణాలతో పాటు గ్రామాలలో సైతం చికెన్ ధరలు కొండెక్కాయి. సామాన్యుడు ఆదివారం సైతం ముక్కముట్టలేని పరిస్థితి ఏర్పడింది. కిలో అవసరముంటే అర కిలోతో సర్దుకోవాల్సిన పరిసిత్థి నెలకుంది. నిన్నామొన్నటి వరకు కిలో రూ.180 అమ్ముతున్న వ్యాపారులు ఒకేసారి రూ.280 వరుకు పెంచేశారు. దీంతో చికెన్ ప్రియులు అయోమయంలో పడ్డారు. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాలలో దాదాపు 350 చికెన్ షాప్‌లు ఉన్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలతో గ్రామాలలో కూడా అదే రేట్లు దంచుతున్నారు. వ్యారులు సిండికేట్ అయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏడురోజుల్లోనే రూ.100 పెంచిన వ్యాపారులు

చికెన్ ధర ఒక్కో ప్రాంతంలో ఓ ధర విక్రయిస్తున్నారు. మండల కేంద్రాలలో కేజీ రూ.280 నుంచి రూ.320 వరుకు విక్రయిస్తున్నారు. గ్రామాలలో కిలో రూ.260 నుంచి రూ.290 వరుకు విక్రయిస్తున్నారు. గత వారంలో కిలో రూ.180 నుంచి రూ.220 వరుకు విక్రయించారు. ఈ నెల 19 వ తేదీ నుంచి నియోజక వర్గంలో రూ.280 నుంచి రూ.320 వరుకు ధర పెంచి విక్రయిస్తున్నారు. వారంలోనే దాదాపు రూ.100 పెరగడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చికెన్ ధరలు విపరీతంగా పెరగడంతో ధరలును నియంత్రించాలి ప్రజలు అధికారలను కోరుతున్నారు.



డోన్ పట్టణంలో కిలో రూ.300 బోర్డు పెట్టి విక్రయిస్తున్న దృశ్యం

ధరలు విపరీతంగా పెంచారు



వ్యాపారులు చికెన్ ధరలు విపరీతంగా పెంచారు. కిలో రూ.280 విక్రయిస్తున్నారు. సామన్య ప్రజలకు అందుబాటులో లేని విధంగా ధరలు పెంచేశారు. పట్టణాలతో ఏవి ధంగా అమ్ముతున్నారో గ్రామాలలో కూడా అదే రేటు ఉంది. మాంసంతో పోటీ పడుతుంది చికెన్ ధర. అధికారులు స్పందించి ధరలు నియంత్రించాలి.

–వెంకటేశ్వర్ రెడ్డి,గిద్దలూరు గ్రామం

కోళ్ల ఉత్పత్తి తగ్గిందట



వారం రోజుల్లోనే రూ.100 పెంచి విక్రయిస్తున్నారు. ఏంటిందంటే కోళ్ల ఉత్పత్తి తగ్గిందంటున్నారు. వ్యాపారులు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నారు. వేసవి కాలం వస్తే చాలు రేట్లు అమాంతంగా పెంచి విక్రయిస్తుంటారు. చికెన్ ధరలపై అధికారులు వెంటనే స్పందించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

– చాకలి కంబగిరి,గిద్దలూరు గ్రామం

డోన్ పట్టణంలో కిలో చికెన్ రూ.300

చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. వ్యాపారులు రేట్లను అమాంతం పెంచేశారు. డోన్ పట్టణంలో అనుమతులు ఉన్న చికెన్ దుకాణాలు దాదాపు 150 ఉండగా అనాధికారికంగా మరో 50 దుకాణాలలో చికెన్ విక్రయాలు సాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఏకంగా కిలో చికెన్ ధర రూ.300 వరకు విక్రయించారు. ఆదివారం సైతం ఈ ధరే కొనసాగింది. స్కిన్ లెస్ అయితే రూ.320, చికెన్ పకోడ కిలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. ప్రజలు ప్రశ్నిస్తే డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేదని చికెన్ వ్యాపారస్తులు అంటున్నారు. అయితే పట్టణంలో చికెన్ వ్యాపారస్తులు సిండికేట్‌గా మారారనే ఆరోపణలు లేకపోలేదు. వెల్దుర్తి, ప్యాపిలి, కృష్ణగిరి, ఎమ్మిగనూరు తదితర మండలాలలో పోల్చుకుంటే డోన్ మండలంలోనే అధికంగా కిలో చికెన్‌కు రూ.20 నుండి రూ.30 వరకు ఎక్కువ ఉంటుంది. దీంతో వ్యాపారులు ఒక్కటయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హోల్ సేల్‌లో కోళ్ల ఫారాల వద్ద లైవ్ కోడి కిలో రూ.152 ఉన్నప్పటికీ ,రిటైల్‌గా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చికెన్ ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం



పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: సీపీఎం దక్షిణాది రాష్ట్రాల ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ అన్నారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో పుచ్చలపల్లి 39వ వర్ధంతిని పురష్కరించుకుని ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అల్లావుద్దీన్, మద్దిలేటి, దిబ్బరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, సీపీఎం నాయకులు ఎల్లయ్య, సాధిక్ హుసేన్, రహంతుల్లా, మద్దిలేటి తదితరులు పుచ్చలపల్లి త్యాగాలను గుర్తు చేశారు.



సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్ టౌన్ : స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధక్షుడు నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు,సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి పుచ్చలపల్లి సేవలను గుర్తు చేశారు. పదమూడేళ్లకే ఉద్యమబాట పట్టిన మహనీయుడు పుచ్చలపల్లి అని కొనియడాదరు. కార్యక్రమంలో నాయకులు కోండన్న, చిన్న రహిమాన్, శివరామ్, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామ్మూర్తి, సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, సుధాకర్, అశోక్, హుస్సేన్‌పీరా, సురేంద్ర, రంజిత్, వెంకటేశ్వర్లు, రాజేంద్ర, లక్ష్మన్న, శివరంగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.